క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పడిపూజ



అయ్యప్పకి అభిషేకం చేస్తున్న స్వాములు

ఒంగోలు మెట్రో: స్థానిక కొత్తపట్నం బస్టాండ్ తూర్పుపాలెం అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మూడు మండపాల్లో 18 కలశాలతో విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ చేశారు. అభిషేకాలు నిర్వహించారు. అఖండ భజనలో మాలధారణ స్వాములు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమాన్ని దేవస్థానం చైర్మన్ కాళే వెంకటేశ్వర్లు, సెక్రటరీ పువ్వాడ సురేష్, కోశాధికారి గోవర్ధన్, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత గ్రామాలను తీర్చిదిద్దాలి



బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహిస్తున్న జాలిరెడ్డి, సుజాత, గ్రామస్తులు

వజ్జిరెడ్డిపాలెం (కొత్తపట్నం): బాల్య వివాహ రహిత గ్రామాలను తీర్చిదిద్దాలని వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి పిలుపునిచ్చారు. జండర్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాల్య వివాహాలపై సర్పంచ్ అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని చట్టాలు వచ్చినప్పటికీ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడానికి చేసిన ఉద్యమాల గురించి వివరించారు. బాలబాలికలకు 21 సంవత్సరాలు దాటిన తర్వాత వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరిపితే కుటుంబాలు ఆరోగ్యంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ శివపార్వతి, ఏపీఎం రజియాసుల్తానాబేగం, ఈవోఆర్డీ ఏ.బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పథకాల గురించి వివరిస్తున్న ఎంపీడీవో సుజాత

రాజుపాలెం (కొత్తపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత సూచించారు. రాజుపాలెంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేద ప్రజలు అభివృద్ధి చెందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 17 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. వాటిని ప్రజలు వినియోగించుకుంటున్నారా.. ఇంకా అర్హులైన వారు ఉన్నారా.. ఉంటే వారికి కూడా పథకాలు అందే విధంగా చర్యలు తీసుకునేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం గురించి వివరించారు. డాక్టర్ శివపార్వతి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు ద్వారా ఒక్కో కుటుంబం రూ.5 లక్షలతో ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చన్నారు. పీఎం పోషణ అభియాన్, మొదలగు పథకాల గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పొలాల్లో ఎరువులు ఏ విధంగా పిచికారీ చేయాలి, దాని వలన ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం షేక్ రజియాసుల్తాన్‌బేగం, రూట్ ఇన్‌చార్జి జయశంకర్, డాక్టర్ వైష్ణవి, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సరుకుల పంపిణీ

ఆలూరు (కొత్తపట్నం): మిచాంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆలూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అన్ని వసతులు కల్పించారు. ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి, శైలేష్ సొంత నిధులతో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాగంటి సుధాకర్‌రెడ్డి, పూనూరి ప్రసాద్, గుత్తికొండ జాలిరెడ్డి, గ్రామ కన్వీనర్ రమణమ్మ, సచివాలయ సిబ్బంది, విద్యా సహాయకులు బండమూడి కిరీట, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బత్తుల మహేష్, వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీ బత్తుల అరుణ, ఏఎన్‌ఎం నూతలపాటి శారద, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మిచాంగ్.. హై అలర్ట్..!

- తుఫాన్‌పై పూర్తిస్థాయిలో అప్రమత్తం
- తీరప్రాంతాల్లో పర్యటించిన అధికారులు
- పునరావాస కేంద్రాల్లో వసతుల పరిశీలన
- హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ కారణంగా హై అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రధానంగా కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లోని సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో అధికారులు పర్యటించారు. మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. పునరావాస కేంద్రంలో అన్ని వసతులున్నాయా, వారికి ఏం అవసరం అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, రెండు రోజుల పాటు ఇక్కడే ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తర్వాత గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా యంత్రాల సహాయంతో బయటకు పంపించే ఏర్పాటు చేయాలని ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్యను ఆదేశించారు. వీధుల వెంట వెంటనే బ్లీచింగ్, సున్నం వేసుకోవాలని సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేసి బ్లీచింగ్ వేసుకుని నీటి కుళాయిలకు పంపించాలని ఆదేశించారు. తుఫాన్ తీవ్రత తగ్గేంత వరకు పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. డీపీవో వెంట సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, పెద్దిసింగ్ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, మెడికల్ సిబ్బంది ఉన్నారు.

గ్రామస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి...

ఒంగోలు సిటీ : తుఫాన్ ప్రభావిత మండలాల్లో గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు, పీఆర్ ఆర్డీలు విపత్కర పరిస్థితులు ఎదర్కోవడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. తుఫాన్ సహాయక కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, వర్షం వలన పల్లపు ప్రాంతాల్లో నిలిచే నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పరిధిలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు తొలగించి ఈదురు గాలులకు ప్రాణ నష్టం కలగకుండా చూడాలని చెప్పారు. మంచినీటి వనరులను క్లోరినేషన్ చేసి నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీపీఓ కోరారు.

ఒంగోలు మండలంలోని గ్రామాల్లో పర్యటించిన తహసీల్దార్ మురళి...

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. ఉదయం నుంచి వర్షం, చలిగాలుల తీవ్రత పెరిగింది. ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి మత్స్యకార గ్రామాలైన గుండాయపాలెం, దేవరంపాడు, చింతాయగారిపాలెంలో పర్యటించారు. పల్లపు ప్రాంతాల్లో ఉండే ప్రజలను, పూరిపాకల్లో ఉండే వారిని సమీప హైస్కూలు, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని కార్యదర్శులు ఆశీర్వాదం, స్వప్న, వీఆర్వోలు జగదీష్ బాబు, రామకృష్ణలను ఆదేశించారు. గుండాయపాలెం, చింతాయగారిపాలెం గ్రామాల్లో మత్స్యకారుల బోట్లను మెరక ప్రాంతాలకు, వలలను జెట్టిలోకి తరలించారు. కరవది పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఎస్.వాణి ఉలిచి గ్రామంలో ఏఎన్‌ఎంలకు మెడికల్ కిట్లు అందజేశారు. రానున్న రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కలుషిత నీరు తాగితే అంటువ్యాధులు ప్రబలుతాయని, అలా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎంపీడీఓ అజిత పర్యటన...

ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెం, కరవది, ఉలిచి, దేవరంపాడు, గుండాయపాలెం గ్రామాల్లో సోమవారం రాత్రి 7 గంటలకు డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్, ఎంపీడీఓ పి.అజిత పర్యటించారు. గాలుల వేగం పెరిగిపోవడం, కుండపోతగా వర్షం కురవడంతో గ్రామ కార్యదర్శులు అందరూ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని, పరిస్థితిని అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు తెలియజేయాలని ఆదేశించారు. అన్ని సచివాలయాల్లో గ్యాస్ సిలిండర్లు, చార్జింగ్ లైట్లు, రేషన్ షాపు డీలర్ల వద్ద బియ్యం, సరుకులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని విధుల్లో ఉండాలని సచివాలయ, రెవెన్యూ, వైద్యారోగ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ ప్రభావంతో ఇప్పటికే మండలవ్యాప్తంగా ఈదురుగాలులు వీయడంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావం మంగళవారం అధికంగా ఉంటుందనే హెచ్చరికలతో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు మండల వ్యాప్తంగా పర్యటించి సమస్య ఉన్న చోట సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. తీగలపై చెట్లు పడతాయని అనుమానం ఉన్న చోట ముందుగానే చెట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కనపర్తి తీరప్రాంత గ్రామాలైన చిన్నంగారిపట్టపుపాలెం, మేకల సోమయ్య పట్టపుపాలెం గ్రామాల్లో తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి, ఎస్సై హరిబాబు పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని కనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసి తీర ప్రాంత ప్రజలను తరలించారు.

చీమకుర్తిలో తుఫాన్ హెల్ప్ డెస్క్...

చీమకుర్తి: తుఫాన్ కారణంగా చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఏదైనా సమస్య తలెత్తితే హెల్ప్ డెస్క్‌లోని ఎంఆర్ఐ ఫోన్ నంబర్ 83746 29093, గ్రామ రెవెన్యూ అధికారి ఫోన్ నంబర్ 99599 60012లకు తెలియజేసి పరిష్కారం పొందాలని తహసీల్దార్ సూచించారు.



గుండాయపాలెంలో పర్యటిస్తున్న ఒంగోలు తహసీల్దార్ మురళి



మేకల సోమయ్యపట్టపుపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, అధికారులు



గుండాయపాలెం సచివాలయంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎంపీడీఓ అజిత



నాగులుప్పలపాడు: విద్యుత్ స్తంభాలపై తీగలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



అమ్మనబ్రోలులో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



ఒంగోలు పోతురాజు కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్



కె.పల్లెపాలెం పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శిస్తున్న డీపీవో

ఒంగోలులో మేయర్ గంగాడ పర్యటన

ఒంగోలు సబర్బన్: తుఫాన్ నేపథ్యంలో నగరంలోని శివారు ప్రాంతాల్లో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన చర్యలు చేపట్టి అప్రమత్తం చేశారు. ప్రధానంగా పోతురాజుకాలువతో పాటు నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగింపజేశారు. నగర పాలక సంస్థ సిబ్బంది, అధికారులను ప్రాంతాల వారీగా కేటాయించి వర్షం నీరు సజావుగా ప్రవహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రిపుల్ ఐటీ కాలేజీ వద్ద నల్లకాలువలో అడ్డంగా పడి ఉన్న ఆర్‌సీసీ పైపులను తొలగించారు.

సీపీఎం నాయకుల పర్యటన...

ఒంగోలు టౌన్: నగర శివారు ప్రాంత ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సీపీఎం నాయకుడు అత్తింటి శ్రీనివాసులు, తదితరులు సోమవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. శివారు కాలనీల్లో వారు పర్యటించి ప్రజల స్థితిగతులను తెలుసుకున్నారు. పులి వెంకటరెడ్డి కాలనీ, జాషువాకాలనీ, అశోక్‌నగర్, దత్తాత్రేయకాలనీ, సంఘమిత్ర దగ్గర ప్రగతి కాలనీల్లో పర్యటించారు. పలు చోట్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, తుఫాన్ తగ్గుముఖం పట్టేంత వరకు ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

తుఫాన్ నేపథ్యంలో జాగత్తలు తీసుకోవాలి...

ఈతముక్కల (కొత్తపట్నం): మిచాంగ్ తుఫాన్ తీవ్రంగా ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి సూచించారు. ఈతముక్కలలో సోమవారం ఆయన పర్యటించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ షెల్టర్‌లోని మత్స్యకారులను పరామర్శించారు. తుఫాన్ వలన ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సచివాలయం ద్వారా ఆపదమిత్ర ట్రైనింగ్ అయిన వలంటీర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఏదైనా అత్యవసరంగా కావాల్సి వస్తే వారికి సమాచారం అందించాలని కోరారు. వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సహాయం చేస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కె.కిరణ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జాలిరెడ్డి, కొండయ్య, సాగర్ మిత్ర కోటేశ్వరరావు, ఆపద మిత్రలు, మత్స్యకారులు పాల్గొన్నారు.



ఒంగోలులోని వెంకటేశ్వరకాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు



ఈతముక్కల తుఫాన్ షెల్టర్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న రవీంద్రరెడ్డి

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మత్స్యశాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డి

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో తీరంలోని ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్యశాఖాధికారస్వావుల చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. చేపలు, రొయ్యలు పట్టవద్దని, మేత తగ్గించి వేయాలని, చెరువుల్లో రసాయన ఎరువులు, రసాయన మందులు చల్లరాదని చెప్పారు, కరెంటు లభ్యత ఉన్నా డీజిల్ ఇంజన్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బలహీనంగా ఉన్న చెరువు గట్లను ఇసుక బస్తాలతో పటిష్టపరుచుకోవాలని తెలిపారు. అధిక వర్షాలకు చెరువులు పొంగే అవకాశం ఉన్నందున కొంత నీటిని ముందుగానే బయటకు పంపాలని చెప్పారు. ఉదజని సూచిక తగ్గే అవకాశం ఉన్నందున వర్షం తగ్గిన వెంటనే ఎకరానికి 50 నుంచి 100 కేజీల వ్యవసాయ సున్నం వాడుకోవాలన్నారు. చెరువు గట్లపై విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆక్వా రైతులకు సూచించారు.







ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం

పశువులకు వచ్చే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి బేబీరాణి

ఈతముక్కల (కొత్తపట్నం): తుఫాన్ కారణంగా వర్షాలకు పశువులకు వచ్చే వ్యాధులపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బేబీరాణి సూచించారు. తుఫాన్ సమయంలో పశువులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలనే ఉద్దేశంతో ఈతముక్కల గ్రామంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ సమయంలో పశువులను ఆరుబయట కట్టేయకుండా షెడ్‌లో ఉంచాలని సూచించారు. పశువులను కట్టేసే చోట పరిశుభ్రత పాటించాలన్నారు.

ముందు జాగ్రత్త చర్యగా పశువులకు ఏం వ్యాధులు రాకుండా గొంతువాపు టీకాలు వేయించారు. పశువులకు వాతపుపొడి, పోషకాలతో కూడిన మందులను ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. పశువులు ఉన్న రైతుల దగ్గర తప్పనిసరిగా హెల్త్ కార్డు ఉండాలని సూచించారు. ప్రతి ఆరు పశువులకు ఒక హెల్త్ కార్డు, 20 గొర్రెలకు హెల్త్ కార్డు ప్రభుత్వం ఇస్తోందని వివరించారు. హెల్త్ కార్డులో పశువులకు చేయించిన వ్యాధి నివారణ టీకాల సమాచారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు, పశువైద్యాధికారిని డాక్టర్ టి.అనూష, జేవీవో కె.సుశీల, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.



ఈతముక్కలలో పశువులకు టీకాలు వేస్తున్న బేబీరాణి, అనూష

తుఫాన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు

- కలెక్టర్లను ఆదేశించిన సీఎం వైఎస్ జగన్

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్ వల్ల ఎట్టి పరిస్థితుల్లో ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా చూడాలని, అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వీడియో సమావేశం నిర్వహించి జిల్లా పరిస్థితులపై సమీక్షించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌తో పాటు ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనిలో ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. సహాయక, పునరావాస చర్యల్లో ఎటువంటి లోపాలు లేకుండా మానవతా దృక్పథంతో బాధితులకు సంతృప్తికర స్థాయిలో సహాయం అందించాలని స్పష్టం చేశారు. పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం నుంచి తుఫాన్ ప్రభావిత జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా జిల్లాకు ప్రద్యుమ్నను ప్రత్యేక అధికారిగా నియమించారు. దీనిలో డీపీవో నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి గోపిచంద్, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డీఐఓ పద్మజ, మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, టీబీ అధికారి సురేష్‌కుమార్, డీటీసీ సుశీల, సీపీవో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.